క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ

జమ్మలమడుగు : ఐసీడీఎస్ శాఖలో ఉన్న హెల్పర్, వర్కర్ పోస్టులకు గురువారం ప్రశాంతంగా ఇంటర్వ్యూలు ముగిశాయి. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జి.శ్రీనివాసులు అధ్యక్షతన ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ముద్దనూరు ప్రాజెక్టు పరిధిలో 20 మంది అభ్యర్థులు, ప్రొద్దుటూరులో అర్బన్‌లో 15, రూరల్‌లో 16, జమ్మలమడుగులో 14 మొత్తం 65 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ, ఐసీడీఎస్ అధికారులు రాజేశ్వరి, ముంతాజ్, హైమావతి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువజనోత్సవాలు



విద్యార్థినికి బహుమతిని ప్రదానం చేస్తున్న ఎస్ఐ తిరుపాల్‌నాయక్, తదితరులు

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ యువజన దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సి.యోగాంజనేయులు స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంబరాలకు ఎస్ఐ తిరుపాల్ నాయక్ హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం పలు పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఓబుళరెడ్డి, అధ్యాపకులు, రాజారెడ్డి, పీడీ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ ఉత్సవం



జండా ఊరేగింపు

వల్లూరు : మండలంలోని పెద్దపుత్తలో గురువారం గ్యార్మీ ఉత్సవాన్ని ఖాదర్‌బాషా(కైటాన్) ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వారి గృహం నుంచి డప్పు వాయిద్యాలతో జండాలను గ్రామ వీధుల గుండా దస్తగిరి స్వామి దర్గా వరకు ఊరేగించారు. అనంతరం ఫాతెహా నిర్వహించి జండాలను దర్గా వద్ద కొలువు తీర్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గ్రామోత్సవంలో ఫకీర్లు చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

విద్యార్థుల సేవ అభినందనీయం



మాట్లాడుతున్న వేముల జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డి

వేముల : సరైన గ్రామాన్ని ఎంచుకుని విద్యార్థులు సేవ చేయడం ఎంతో అభినందనీయమని వేముల జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డి అన్నారు. గురువారం వేముల మండలం ఎద్దులయేనే గ్రామంలో పులివెందుల ఫుడ్అండ్ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.బేగ్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం నిర్వహించిన ప్రత్యేక శిబిరం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ హాజరై మాట్లాడుతూ ఈ ప్రత్యేక శిబిరం ద్వారా గ్రామస్తులకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చి గ్రామ ప్రజలకు సేవ చేయడం మంచి కార్యమన్నారు. అంతకముందు స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

యువత సక్రమ మార్గంలో నడవాలి

సీనియల్ సివిల్ జడ్జి ఎస్.కవిత

కడప ఎడ్యుకేషన్ : యువత మద్యం, మత్తుకు బానిసలు కాకుండా సక్రమమైన మార్గంలో నడుచుకుని లక్ష్యాలను సాధించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో నెహ్రూ యువ కేంద్రం వారు ఏర్పాటు చేసిన జాతీయ యువ దినోత్సవం కార్యక్రమానికి జడ్జి కవిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్టెప్‌సీఈఓ సాయిగ్రేస్, డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ ఎస్వైకే మణికంఠ, విజేత మహిళా మండలి అధ్యక్షులు అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకంలో చెరువులకు సాగునీరు

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎత్తిపోతల పథకం మ్యాపును పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ముద్దనూరు : వామికొండ జలాశయం నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ముద్దనూరు మండలంలోని 6 చెరువులకు సాగునీరందించి భూములను సస్యశ్యామలం చేస్తామని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పలూరు–ఆకుతోటపల్లె పెద్ద చెరువును గురువారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ రూ.11 కోట్ల 96 లక్షల వ్యయంతో వామికొండ జలాశయం నుంచి పూలచెరువు, వేల్పుచెర్ల, పెనికలపాడు, ఆకుతోటపల్లె పెద్ద చెరువు, ఉప్పలూరు చిన్న చెరువు, కొలవలి చెరువులకు నీరందిస్తామని తెలిపారు. చాలాకాలంనుంచి స్థానిక రైతులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి భూగర్భజలాలు అడుగంటకుండా పెద్ద చెరువుకు నీటిసరఫరా చేయాలని కోరుతున్నారని, రైతుల కోరికమేరకు ఫిబ్రవరి నెలలో టెండర్లు పూర్తిచేసి మార్చినెలలో పనులు ప్రారంభించి 6 నెలల్లో 6 చెరువులకు సాగునీరందిస్తామని ఎంపీ తెలిపారు. ఈ పథకంతో చీనీ రైతులను ఆదుకోవడమే గాకుండా భూగర్భజలాలు పెరుగుతాయని ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు ఉప్పలూరు ప్రాంత రైతులను నిర్లక్ష్యం చేశారన్నారు. జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా నీటిని వదిలి సాగునీరు వనరులు పెరిగేలా చూస్తామని, ఇప్పటికే మండలంలోని గంగాదేవిపల్లె, మంగపట్నం చెరువుల ఎత్తిపోతల పథకాల ద్వారా నీరందించడానికి కృషిచేస్తున్నామని తెలిపారు.

ఓటీఎస్ లబ్ధిదారులకు ఇంటి డాక్యుమెంట్ల పంపిణీ



ఓటీఎస్ ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ, తదితరులు

సింహాద్రిపురం : మండల పరిధిలోని రావులకొలను గ్రామ పంచాయతీలో గురువారం 15 మంది ఓటీఎస్ లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి చేతులమీదుగా ఇళ్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి ఓటీఎస్ పథకాన్ని అర్హులైన ఇళ్ల లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇళ్లకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఉండటంవల్ల భవిష్యత్‌లో ఎవరికైనా అమ్ముకునేందుకు వీలుంటుందని.. అలాగే ఇళ్ల పత్రాలను బ్యాంకులో తాకట్టు పెట్టి రుణాలు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకటసుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

చక్రాయపేట : యువతకు స్వామి వివేకానందుడు ఎంతో స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని సురభి గ్రామం నాగలగుట్టపల్లెలోని జనజాగృతి గ్రామీణ గ్రంథాలయం వద్ద నఠిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, వైఎస్ఆర్‌సీపీ బీసీ నేతలు బాలకృష్ణ, శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిప్రసాద్‌లు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

చెన్నూరు : మండలంలోని రామనపల్లి గ్రామం దళితవాడలో అట్లూరి నాగమ్మ గురువారం మృతి చెందడంతో అంబేద్కర్ సేవా సంఘం అధ్యక్షుడు గురయ్య సంఘం తరుపున అంత్యక్రియల నిమిత్తం రూ.2 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సేవా సంఘం కార్యదర్శి పెంచలయ్య, కోశాధికారి బ్రహ్మయ్య, స్థానికులు పాల్గొన్నారు.

నూతన మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభం



మినరల్ వాటర్ ప్లాంటు వద్ద కొళాయి ఆన్ చేసిన జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

వేంపల్లె : గిడ్డంగివారిపల్లె పంచాయతీలోని అశోక్‌నగర్‌లో మినరల్ వాటర్ ప్లాంటును గురువారం వేంపల్లె జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి ఎంపీపీ లక్ష్మీగాయత్రి, సర్పంచ్ ఓబుళరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశోక్ నగర్‌లో గత కొన్నేళ్లుగా తాగునీటికి ఇబ్బందులు పడేవారని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి ఆ గ్రామ ప్రజలు తాగునీటి సమస్యను తీసుకొచ్చారు. స్పందించిన ఆయన పాడా నిధుల కింద రూ.8 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయించారు. గ్రామాల దాహార్తి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శివశంకర్‌రెడ్డి, వరాలమ్మ, బక్కన్నగారిపల్లె సర్పంచ్ మల్లయ్య, మాజీ సర్పంచ్ ఆర్ఎల్వీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు ఉత్సవం

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రం, విశ్వవిఖ్యాత పర్యాటక ప్రాంతమైన కడప అమీన్‌పీర్ (పెద్ద)దర్గాలో గురువారం హజరత్ దాదా ముర్షద్ అమీన్‌పీర్ సాహెబ్ వారి ఉరుసు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అలంకరించిన కలశంలో గంధంతో దర్గా గురువులు హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తమ స్వగృహం నుంచి ఫకీర్ల మేళ తాళాలు, విన్యాసాల మధ్య దర్గాకు చేరుకున్నారు. తర్వాత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దర్గాలోని గురువుల మజార్‌వద్ద గంధం సమర్పించారు. ఫాతెహా నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

సంక్షేమ పథకాల రూపకర్త సీఎం వైఎస్ జగన్



ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : రాష్ట్రంలో పేద ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల రూపకర్త సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తనయుడు సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 4, 12, 13వ మున్సిపల్ వార్డుల పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. అర్హులుగా ఉండి ఎవరికైనా పథకం రాకుంటే అక్కడికక్కడే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పథకాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ప్రజలు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి నవ రత్నాలను ప్రవేశపెట్టారు. వాటి అమలుకు వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. ఇంటికే పింఛన్, రేషన్ ఇస్తున్నారన్నారు. అలాగే ప్రతి 2వేల జనాభాకు సచివాలయాలు నిర్మించి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. సచివాలయాల ప్రాంగణంలోనే ఆర్‌బీకేలు నిర్మించి అన్నాదాతల ముంగిటకే రైతు సేవలు అందిస్తున్నారన్నారు. అలాగే హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చారన్నారు. 31 లక్షల మందికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తున్నారని తెలిపారు. ఇన్ని పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, మోహన్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి, షావలి, గౌస్ మున్నా, హిదాయత్, ఇర్ఫాన్, గఫార్, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బ్రిడ్జిలను నిర్మించాలి

కడప రూరల్ : కడప నగరంలో బుగ్గవంక పరీవాహక ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం బ్రిడ్జిలు నిర్మించాలని వివిధ పార్టీలు, సంఘాల నేతలు తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐకి చెందిన అలీఖాన్, నారాయణ, వెంకటశివ, మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి మాట్లాడారు. బుగ్గవంక పరివాహకం ప్రాంతం రవీంద్రనగర్ పాత లా కాలేజీ, గుర్రాలగడ్డ ప్రాంతాల్లో స్థానిక ప్రజల సౌకర్యార్థం బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అమీర్‌బాబు, హరిప్రసాద్, మక్బూల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు వృషభాచలేశ్వరస్వామి కల్యాణం

వేంపల్లె : ధనుర్మాస పూజలలో భాగంగా వేంపల్లెలో పవిత్ర పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానమైన వేంపల్లెలోని మెయిన్ బజార్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ చైర్మన్ కె.వెంకటేష్‌లు తెలిపారు. 15వ తేదీన మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఆంజనేయ స్వామి ఆలయంలో సాయంత్రం శ్రీవృషభాచలేశ్వర స్వామి గ్రామోత్సవం ఉంటుందన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు మునిశంకరయ్య



'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ మునిశంకరయ్య

కడప కార్పొరేషన్ : విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.మునిశంకరయ్య అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో ఆయన వినియోగదారుల నుంచి ఫోన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కడప, కొండాపురం, సీకే దిన్నె మండలాల నుంచి ఐదుగురు ఫోన్ చేసి తమ సమస్యలు తెలిపారు. ఇందులో వ్యవసాయ సర్వీసులకు సంబంధించి–1, విద్యుత్ లైన్‌కు సంబంధించి–4 సమస్యలు ఉన్నాయి. వీటిని పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఈఈ పి. సుబ్రమణ్యం, జేఈ జి.లావణ్య పాల్గొన్నారు.

ఇంటివద్దే అర్జీల స్వీకరణ

సింహాద్రిపురం : సంక్రాంతి పండుగ తర్వాత సచివాలయ సిబ్బంది ఇంటి వద్దనే సమస్యల అర్జీలను స్వీకరిస్తారని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు ప్రతి ఒక్క గ్రామంలోని 30 నుంచి 50 కుటుంబాలను సచివాలయ సిబ్బంది సందర్శించి ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరిస్తారన్నారు. తక్షణమే తీరే సమస్యలను అక్కడే పరిష్కరిస్తారని.. తీర్చలేని సమస్యల అర్జీలను అధికారులకు అందిస్తారని తెలిపారు.

సచివాలయ సిబ్బంది సమయం పాటించాలి



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : సచివాలయాలలో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం వార్డు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సచివాలయం ద్వారా సర్వీసులను పెంచాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్లు పొందిన లబ్ధిదారులతో రూ.35వేల డబ్బులను కట్టించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అలాగే స్వచ్ఛ పులివెందుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో ఈద్గా అభివృద్ధి పనులు

ప్రొద్దుటూరు : మున్సిపల్ నిధులు రూ.60లక్షలతో త్వరలో ఈద్గా పనులను ప్రారంభించనున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ముస్లిం మైనారిటీ నాయకులు, అంజుమన్ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ రంజాన్, బక్రీద్ పండుగల సందర్భంగా ముస్లి మైనారిటీ ప్రజలు ప్రార్థనలు చేసుకునేందుకు అనువుగా కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానం అభివృద్ధికి త్వరలో టెండర్లు నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు ప్రారంభం

వీరపునాయునిపల్లె : మండలంలోని గోనుమాకులపల్లె గ్రామంలో గుర్రప్పయాదవ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి సంక్రాంతి సంబరాలు ప్రారంభం కానున్నట్లు సొసైటీ అధ్యక్షుడు రాజశేఖర్ యాదవ్ తెలిపారు. 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంటు, 14వ తేదీ భోగిమంటలు, చిన్నారులకు ఆటలపోటీలు, 15వ తేదీ ఉదయం రుక్మిణీ సమేత శ్రీకృష్ణాలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 2గంటలకు మండల స్థాయి ముగ్గుల పోటీలు, సాయంత్రం 4గంటలకు రుక్మిణీ సమేత శ్రీకృష్ణ స్వామి గ్రామోత్సవం, 16వ తేదీ ఉదయం గ్రామంలోని యువతీ యువకులకు ఆటల పోటీలు, 10 గంటలకు ట్రాక్టర్ రివర్స్ పోటీలు, సాయంత్రం ఉట్టికొట్టు కార్యక్రమం, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ పోటీలు

ప్రొద్దుటూరు : స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని ఎకో పార్కులో గురువారం స్పోర్ట్స్ అండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షెటిల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు.

సంక్షేమ లబ్ధితో ప్రజల్లో సంతోషం

ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి



ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

పెద్దముడియం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని దిగువ కల్వటాల గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం మూడున్నరేళ్లలో అందజేసిన సంక్షేమ పథకాలు, పొందిన లబ్ధిని వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అవ్వా తాతలకు ప్రతి నెలా అందించే పింఛన్ నగదును రూ.2,500 నుంచి రూ.2,750 పెంచి ఈనెల అందజేశారన్నారు. గతంలో పింఛన్ పొందాలంటే ఎన్నో అవస్థలు పడాల్సి వచ్చేదని, నేడు ప్రతినెల 1వ తేదీ తెల్లవారుజామునే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందజేస్తుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. గతంలో ఒక ఇంటికి ఇన్ని రకాల పథకాలు అందిన దాఖలాలు లేవన్నారు. టీడీపీ పాలన, ప్రస్తుత పాలనకు తేడా గమనించాలన్నారు. పథకాలు కొనసాగాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి, మండల కన్వీనర్ చవ్వా కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కృష్ణయ్య, తలారి మహేష్, రఘునాథరెడ్డి, భాస్కర్ రెడ్డి, పుల్లయ్య, గ్యాస్ శివారెడ్డి, మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండల పరిధి దొమ్మరనంద్యాల గ్రామంలోని సచివాలయం 2 కొత్త మసీదు దగ్గర నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మైలవరం మండలంలోని గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు జమ్మలమడుగు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో జరుగనున్నట్లు ఆయన తెలిపారు.

భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష



శ్రీలేఖకు ఆర్థిక సాయం అందిస్తున్న కళాశాల యాజమాన్యం, పూర్వపు విద్యార్థులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో గురువారం పూర్వపు విద్యార్థుల కోసం భవిష్యత్‌లో చేయాల్సిన కార్యకలాపాల గురించి చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ అమల్‌రాజ్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, పూర్వపు విద్యార్థులు కార్యాలయ ఆవరణలో సమీక్ష నిర్వహించారు. ఏపీఎం ఆంజనేయులు మాట్లాడుతూ కళాశాల పూర్వపు విద్యార్థిగా ఎవరైనా నన్ను సంప్రదిస్తే వారు ప్రభుత్వ పథకాలకు అర్హత ఉంటే మేము తప్పకుండా తోడ్పడతామన్నారు. అనంతరం ఇటీవల కళాశాల పూర్వపు విద్యార్థిని శ్రీలేఖ రోడ్డు ప్రమాదంలో గాయపడి చేతికి ఆపరేషన్ చేయాల్సి రావడంతో పూర్వపు విద్యార్థుల సంఘం, కళాశాల యాజమాన్యం నుంచి రూ.30వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

పొలంబడి శిక్షణతో అధిక దిగుబడి



పొలంబడి కార్యక్రమంలో సూచనలు ఇస్తున్న ఏఓ

ముద్దనూరు : పొలంబడి శిక్షణ కార్యక్రమం ద్వారా రైతులు సాగులో మెళకువలు పొంది అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. గురువారం కొత్తపల్లె గ్రామంలో సర్పంచ్ అరుణమ్మ, రైతులతో కలిసి ఆయన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. 30 మంది రైతులకు 14 వారాల పాటు పంటసాగులో, యాజమాన్య పద్ధతులు, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక పురుగుమందుల వినియోగం తగ్గించడం, మిత్ర పురుగుల సంరక్షణ తదితర అంశాల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఓ సుధాకర్, తదితరులు

పులివెందుల టౌన్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 14వ తేదీ నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు శిల్పారామ పరిపాలనాధికారి సుధాకర్ తెలిపారు. గురువారం స్థానిక శిల్పారామంలో సంక్రాంతి సంబరాలకు సంబంధించిన పోస్టర్లను సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 14, 15, 16వ తేదీలలో సాయంత్రం 5 గంటలనుంచి రాత్రి 8 గంటలవరకు జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయని పులివెందుల ప్రాంత ప్రజలు ఈ సంబరాలలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గ్లాస్ దుకాణం ప్రారంభం



దుకాణాన్ని ప్రారంభిస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని నారాయణ కళాశాల సమీపంలో కార్పెంటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి ఏర్పాటు చేసిన అశ్వర్థసాయి గ్లాస్ దుకాణాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధర రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పెంటర్స్ తదితరులు పాల్గొన్నారు.

18న నమూనా కానిస్టేబుల్ పరీక్ష

ప్రొద్దుటూరు : నమూనా కానిస్టేబుల్ పరీక్షను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని త్రీటౌన్ సీఐ నారాయణ యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో నమూనా పరీక్షలు చాలా ఉపయోగపడుతాయన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ ఈనెల 18న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కానిస్టేబుల్ నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, వెంకటేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

జామియా మసీదును వక్ఫ్‌బోర్డుకు అప్పగింత



వక్ఫ్‌బోర్డు అధికారులకు మసీదు పత్రాలను అందచేస్తున్న బషీర్ అహ్మద్

ప్రొద్దుటూరు కల్చరల్ : జామియా మసీదును, మసీదు ఆస్తులను వక్ఫ్‌బోర్డుకు అప్పగించినట్లు జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు బేపారి బషీర్ అహ్మద్ తెలిపారు. గురువారం సాయంత్రం వక్ఫ్ బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆడిటర్ షేక్ అన్వర్‌హుసేన్, షేక్ గౌస్‌బాషాలకు మసీదు ఆస్తుల పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మసీదు కమిటీ అధ్యక్షుడిని అయిన తరువాత మసీదును పునర్ నిర్మించి దశల వారీగా అభివృద్ధి చేశానన్నారు. మసీదును ఆధునీకరించి సెంట్రల్ ఏసీతో పాటు ఒకేసారి 2 వేల మంది ప్రార్థనలు చేసుకునేలా మసీదును నిర్మించానన్నారు. శ్మశాన వాటికను అభివృద్ధి చేయడంతోపాటు, మసీదు నిర్వహణ కోసం రూముల నిర్మించానన్నారు. 30 సంవత్సరాలుగా ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవని, ఒక సంవత్సర కాలంగా అవినీతి జరుగుతోందని కొందరు విమర్శలు చేయడం బాధాకరమన్నారు. మసీదుకు సంబంధించి 88 రూములు, 2 స్కూల్ భవనాలు, 1 ఫంక్షన్‌హాల్, 3 ఇళ్లు, చరాస్తుల వివరాలు, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో రూ.64,47,000 సేవింగ్ పత్రాలు తదితర అన్ని పత్రాలను, అన్ని రికార్డులను వక్ఫ్‌బోర్డు అధికారులకు అందించారు. మసీదు ఆస్తులకు సంబంధించి హైకోర్టులో 67 సెంట్లు, 32 సెంట్లు స్థలానికి 2 పిటీషన్లు తుది విచారణలో ఉన్నాయన్నారు. వాటిపై వక్ఫ్ అధికారులు దృష్టిసారించి ఆ ఆస్తులు మసీదుకు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మసీదు కమిటీ కార్యదర్శి బాబాబాషా, దస్తగిరి బాషా, బేపారి గౌస్‌బాషా, బేపారి జాకీర్ అహమ్మద్, ఇమాం అబ్దుల్ మాలిక్, మౌజన్ ఇబ్రాయెల్, ముల్లా రియాజుద్దీన్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.